

# గురుదేవో భవ!

''జిల్లా పరిషత్ కార్యాలయం'' అని పెద్ద పెద్ద అక్షరాలు వ్రాయబడి ఉన్నాయి గోడమీద. 'జిల్లా'కు 'పరిషత్'కు మధ్యలో 'ప్రజా' అనే రెండక్షరాలు కనబడకుండా కాగితాలు అతికించేశారు. ఆ అలసత్వాన్ని ఎత్తిచూపుతూ చిరిగిన సందుల్లో నుండి తొంగి చూస్తున్నాయి 'ప్రజా'లు.

ఆలోచిస్తూ ఆఫీసు మెట్లెక్కుతున్నాడు ఆనందరావు.

''నమస్కారంసార్!'' తెల్లని ఖద్దరు వస్త్రాల్లో, చెరగని చిర్నవ్వుతో నిండైన విగ్రహం. గుర్తుకు తెచ్చుకుంటూ ఉండిపోయాడు మేష్టారు ఆనందరావు.

''నేను సార్! సాయిలును. గడ్ సింగాపూరం... కోడిగుడ్లు... బెత్తం దెబ్బ...'' అంటూ క్లూ ఇచ్చాడు నవ్వుతూ.

ఓ రోజు ఆరోతరగతిలో దొంగతనంగా కోడి గుడ్లు తెచ్చుకున్నాడు సాయిలు. మాంజా (గాలిపటాల ప్రత్యేక దారం) తయారు చేసుకోవాలని, అవి వాడి నిక్కరు జేబులో ఉన్నాయని తెలియని తాను బెత్తంతో కొట్టడం, అవి పగిలిపోయి ద్రవం కారడం, తరగతి గది వాతావరణం గందరగోళంగా మారడం, ఆ వెంటనే వాడు రెండు వేళ్ళూ చూపిస్తూ బయటికి పరిగెత్తడం-అంతా ఠక్కున గుర్తొచ్చింది ఆనందరావుకి.

'' ఓర్నీ! నువ్వటయ్యా? బాగున్నావా? అమ్మా నాన్నా బాగున్నారా? నువ్వేంటి ఏదో స్పోర్ట్స్ మాన్‌వౌతావనుకుంటే...'' ప్రశ్నలు కురిపించాడు వెంటనే.

''నేను పదో తరగతికి రాగానే అమ్మపోయింది సార్. స్టేట్‌లెవెల్ అథ్లెటిక్స్‌కి అటెండ్ కాలేకపోయాను. ఆపై మా నాయన మంచాన పడటం,మా పాలోళ్లు ఎగస్పార్టీతో చేతులు కలిపి, రాజకీయంగా, మానసికంగా, ఆయనను దెబ్బదీసారు. ఆ షాక్‌నుండి ఆయన కోలుకోలేదు. నాయన చనిపోవడంతో నా యింటర్ డిస్‌కంటిన్యూ అయింది. కుళ్లు రాజకీయాలపై తిరుగుబాటుగా, నాయన ఆదర్శాలకు దీటుగా, పార్టీల ప్రమేయంలేని రాజకీయ శక్తిగా ఎదిగేందుకు నేను కృషిచేశాను. చిన్నప్పుడు మీరు చెప్పిన మాటలు జీవితమంతా నాకు గుర్తుంటాయి సార్. మాతృదేవో భవ! పితృదేవో భవ! ఆచార్యదేవో భవ! కృషితో నాస్తి దుర్భిక్షమ్! ఇవన్నీ నిజం చేయాలని, అప్పుడే ఈసమాజం బాడుపడ్తదని... సారీ సార్! ఏమేమో మాట్లాడుతున్నాను. మిమ్మల్నీ చూడగానే''.

ఆనందతో పొంగిపోయాడు ఆనందరావు.

''రండిసార్! అలా వెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం. టీచర్ బాగున్నారా? చెల్లెళ్లు బాగున్నారా? ఏం చదువుతున్నారు? ఇంతకూ ఇప్పుడేం పనిమీద వచ్చారు'' అడిగాడు.

''ఛైర్మన్‌ను కలుద్దామని వచ్చాను. నా ట్రాన్స్‌ఫర్ నిలుపు చేయడంగాని, మోడిఫై చేయడం గాని చేస్తే చాలు!'' చెప్పాడు ఆనందరావు

''రండిసార్! ఛైర్మన్ మనవాడే. మనమాట కాదనడు.'' గురువుగార్ని వెంటబెట్టుకొని ఛైర్మన్ ఛాంబర్‌లోకి వెళ్ళాడు.

★ ★ ★

''ఊ! ఏం పేరన్నవూ?'' జారుతున్న కళ్లద్దాలను ఎడమచేతి నడిమివేలుతో పైకి నెట్టుకున్నాడు ఛైర్మన్ శరభయ్య.

''ఆనందరావు సర్!'' వినయం, ఆదరం ఉట్టిపడ్డాయి ఆనందరావు గొంతులో. అంతకు ముందే సాయన్న పరిచయం చేసి వెళ్లాడు.

'' ఊ! అయితే నీకు ట్రాన్సుఫర్ క్యాన్సల్ గావలెనా?'' దీర్ఘం తీస్తూ అడిగాడు.

''....'' అసౌకర్యం ఆనందరావుమొహంలో.

''అవున్‌వయా! టీచరంటే ఏమాన్న మినిష్టరనుకున్నవా? నీపై అధికారి ముందల నీవు గిట్ల కూసోని మాట్లాడ్తవా? పిల్లలకు గూడ గిదే నేర్పిస్తున్నవా?''

''గా సాయన్నగానికెన్ని పైసలిచ్చినవ్? వాడేమన్న ఎమ్మెల్యే అనుకున్నవా?

ఎం.పీ. అనుకున్నావా? వాడొచ్చి గిట్ల జెప్పంగనే గట్ల బుగులువట్టి నీ పని జేసేస్తననుకున్నావా?''

కాళ్లకింద నేల కదుల్తున్న అనుభూతి మేష్టారికి.

''యాడికి ట్రాన్స్‌పరైతే ఏం బొయ్యేదున్నదివయ్యా? అ..? యాడైన ఉత్తగ గూకునేదే. గిప్పుడున్న ఊరు బస్తీకి దగ్గెరున్నది. పుసుక్కున రావొచ్చు. పుసుక్కున వోవచ్చుంటాని జూసుకున్నావ్? లేకపోతే సైడు బిజినెసేమన్న మొదలు వెట్టినవా?''

శివాజీ అఫ్జల్ ఖాన్‌ను చీల్చినట్లు చైర్మన్‌పైకి లంఘించాలనిపించింది రావుకి. కళ్లల్లో ఎర్రజీరలు స్ఫుటమయ్యాయి.

''ఏందివయా కొడ్తవా?'' ఆనందరావు మనస్సును చదువుతున్నట్లుగా శరభయ్య.

'ఒరేయ్! ఉపాధ్యాయుడంటే అర్థమే తెలియని వెధవా! నీవు పదవిలో నుండి దిగితే నిన్ను కుక్కలు కూడా ఆదరించవు! నీకూ నాకూ పోలికేమిట్రా?' అనలేకపోయాడు ఆనందరావు. అది బలహీనతో, సంస్కారమో, సహనమో.

వచ్చిన 'పనైపోయింద'న్నట్లు వెళ్లేందు కుద్యుక్తుడయ్యాడు. అప్పుడే లోపలికొచ్చిన డిప్యూటీ ఇ. ఓ.ని చూడకుండానే ద్వారం వైపు అడుగులేశాడు.

''హలో మాస్టారూ!'' గబగబా చైర్మన్ దగ్గరికి వెళ్తున్న డిప్యూటీ ఇ. ఓ. విష్ణు, ఆనందరావుని చూసి పలకరింపుగా అన్నాడు. రెండు చేతులూ జోడించాడు ఆనందరావు.

ఆనందరావు కళ్లల్లోని ఎరుపు, ముఖంలోని బాధ విష్ణు చూపునుండి తప్పించుకోలేదు. అదే స్పీడుతో ఛైర్మన్ దగ్గరికెళ్లి కరచాలనం చేశాడు. ప్రక్క సీట్లో కూర్చున్నాడు.

''రండి మేష్టారు! అలా వెళ్తారేం! ఒక్కనిముషం'' ఆనందరావును సాదరంగా పిలిచాడు. వెనక్కి తిరిగాడు ఆనందరావు.

వెండి కొండ, నల్లరాతి బండ పక్కపక్కనే ఉన్నట్లు అనిపించింది విష్ణు, శరభయ్యలను చూస్తుంటే అతనికి.

'' ఈ విద్యా సంవత్సరానికి జిల్లా స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డుకి మనం ప్రపోజ్ చేసిన మూడు పేర్లలో మొదటి పేరు ఈ మాష్టారిదే సర్! నేను అన్ని కోణాల నుండి స్టడీ చేశాను.'' ఆపై ఏమేమో వివరిస్తున్నాడు.

మేష్టారి గురించి ఒక్కోమాట వింటుంటే శరభయ్య మొహంలో రంగులు మారసాగాయి.

*(30–9–99 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)*